
సాక్షి
గుంటూరు
శుక్రవారం । 22 । సెప్టెంబర్ । 2023



ఆర్బీకేను సందర్శించిన ట్రైనీ కలెక్టర్

నరసరావుపేట రూరల్: పెట్లూరివారిపాలెం రైతు భరోసా కేంద్రాన్ని ట్రైనీ కలెక్టర్ కల్పనశ్రీ గురువారం సందర్శించారు. పంట నమోదు ప్రక్రియ గురించి అడిగి తెలుసుకున్నారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద గురువారం 3,800 క్యూసెక్కులు విడుదల చేశారు. హైలెవల్ కాలువకు 210 క్యూసెక్కులు వదిలారు.

నేడు 'జగనన్నకు చెబుదాం'

నరసరావుపేట: పల్నాడు జిల్లా పెదకూరపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మధ్యాహ్నం జగనన్నకు చెబుదాం(స్పందన) నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ శివశంకర్ గురువారం తెలిపారు. అచ్చంపేట, అమరావతి, బెల్లంకొండ, క్రోసూరు, పెదకూరపాడు మండలాల ప్రజలు ఫిర్యాదులు అందించవచ్చని పేర్కొన్నారు.



న్యూస్‌రీల్

వైఎస్సార్ సీపీ లీగల్‌సెల్ నియామకాలు

పట్నంబజారు(గుంటూరు): వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు న్యాయవిభాగానికి పలువురిని నియమిస్తూ గురువారం పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. వైఎస్సార్ సీపీ న్యాయ విభాగం జోనల్ ఇన్‌చార్జిగా ఒగ్గు గవాస్కర్, న్యాయ విభాగం గుంటూరు జిల్లా అధ్యక్షుడిగా టి.డి.భగవాన్‌ను నియమించారు. అలాగే పల్నాడు జిల్లా నుంచి న్యాయ విభాగం జోనల్ ఇన్‌చార్జిగా రామిరెడ్డి రోజారెడ్డి, న్యాయ విభాగం పల్నాడు జిల్లా అధ్యక్షుడిగా ఎ.శ్రీనివాసరెడ్డిని నియమించారు.

ఓంకారేశ్వరంలో హనుమ స్వామి



సత్తెనపల్లి: మధ్యప్రదేశ్ ఓంకారేశ్వరంలో ఈనెల 18న జరిగిన 108 అడుగుల జగద్గురు ఆది శంకరాచార్యుల విగ్రహావిష్కరణకు పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణంలోని శ్రీ త్రిశక్తి దుర్గాపీఠం అధిపతి వెలిదండ్ల హనుమ స్వామి హాజరయ్యారు. మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి ఆహ్వానం మేరకు ఆయన ఆది శంకరాచార్యుల విగ్రహావిష్కరణలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గణేశ్ లడ్డూ దక్కించుకున్న జెడ్పీ చైర్‌పర్సన్ క్రిస్టినా



గుంటూరు ఎడ్యుకేషన్: జిల్లా పరిషత్ ప్రాంగణంలోని పంచాయతీరాజ్ ఇంజినీరింగ్, గ్రామీణ నీటి సరఫరా విభాగ కార్యాలయాల సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి విగ్రహానికి గురువారం జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా, సురేష్‌కుమార్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వినాయక విగ్రహ ఉత్సవ కమిటీ నిర్వహించిన లడ్డూ వేలం పాటలో పాల్గొని అత్యధికంగా రూ.15 వేలకు చేజిక్కించుకున్నారు. అనంతరం వినాయకుని నిమజ్జనం నిర్వహించారు. వివిధ విభాగ అధికారులు, ఉద్యోగులు ఉత్సాహంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. తర్వాత పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ జె.మోహన్‌రావు, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల ఫెడరేషన్ జిల్లా ప్రచార కార్యదర్శిగా శివకుమార్



గుంటూరు మెడికల్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల ఫెడరేషన్ (ఏపీజీఈఎఫ్) జిల్లా ప్రచార కార్యదర్శిగా గుంటూరు నగరానికి చెందిన ఫార్మాసిస్టు ముంజంపల్లి శివకుమార్ నియమితులయ్యారు. గుంటూరు ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ కాన్ఫరెన్స్ హాలులో గురువారం ఫెడరేషన్ జిల్లా సమావేశం నిర్వహించారు. చైర్మన్ కాకర్ల వెంకట్రామిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల అనుకూల నిర్ణయాలతో ముందుకు సాగుతోందని తెలిపారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో తాము ముందున్నట్లు వెల్లడించారు. పదోన్నతులు, జీతాల పెంపు, ఇతర సమస్యల్ని పరిష్కరించి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఉద్యోగుల పక్షపాతిగా నిలిచారని వెల్లడించారు. ఉద్యోగులంతా ప్రభుత్వానికి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. అనంతరం శివకుమార్‌కు ప్రచార కార్యదర్శిగా నియామక ఉత్తర్వులు అందజేశారు. కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ ఆర్యపాల్, ఆర్గనైజింగ్ సెక్రటరీ రామకృష్ణారెడ్డి, కోశాధికారి రామకృష్ణ, వైస్ ప్రెసిడెంట్ భాస్కర్‌రెడ్డి, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

చదువుకు శుభాలిక

- దశాబ్దాల రెండు సమస్యలు.. ఆ ఇద్దరితో శాశ్వత పరిష్కారం
- అసాధ్యాలను సుసాధ్యం చేసిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం
- జెడ్పీహైస్కూల్‌తో యడ్లపాడు వాసుల కల సాకారం
- అక్కడే జూనియర్ కాలేజీ నిర్వహణ.. బాలికలకు వరం



గతేడాది ట్యాబ్‌ల పంపిణీ సందర్భంగా యడ్లపాడు జెడ్పీహైస్కూల్ విద్యార్థులతో మంత్రి రజని (ఫైల్)

యడ్లపాడు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయాలు.. వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని ప్రత్యేక చొరవ యడ్లపాడు మండలంలోని పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లల ఉన్నత విద్యకు బాసటగా నిలిచాయి. దశాబ్దాల నాటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాయి. గ్రామీణ విద్యార్థులకు ఇంటర్ విద్య మరింత చేరువైంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విద్యారంగంలో విప్లవాత్మక మార్పులను, వినూత్న పథకాలను అమలు చేసి విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటను వేస్తున్న తీరును చూసి విమర్శకులూ ప్రశంసలు కురిపిస్తున్నారు. మండల కేంద్రమైన యడ్లపాడులో జడ్పీ హైస్కూల్ ఏర్పాటు స్థానిక ప్రజలకు ఓ కల. గ్రామం ఏర్పడినప్పటి నుంచి ఇక్కడ ఒక ఎయిడెడ్, మూడు ప్రైవేటు స్కూల్స్ మాత్రమే ఉన్నాయి. ప్రభుత్వ విద్య పథకాలు లభించేవి కావు. జెడ్పీ హైస్కూల్‌కు వెళ్లాలంటే నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న జగ్గాపురం, లింగారావుపాలెం గ్రామాలకు వెళ్లాల్సి వచ్చేది. దీంతో చాలామంది పిల్లలను అంతదూరం పంపించేవారు కాదు. ముఖ్యంగా ఆడపిల్లల చదువును ఆపేసేవారు.

అప్‌గ్రేడ్‌ను వద్దనుకునే పరిస్థితి..!

2018 టీడీపీ హయాంలో జిల్లాలోని కొన్ని యూపీ పాఠశాలలను హైస్కూళ్లగా అప్‌గ్రేడ్ చేయగా స్థానిక ఎర్రచెరువులోని యూపీ స్కూల్ ఈ కోవలో నిలిచింది. అప్‌గ్రేడ్ అయిందన్న మాటేగానీ కావల్సిన సౌకర్యాలను కల్పించలేదు. నిధులేమీ విడుదల కాకుండానే హడావిడిగా టీడీపీ నేతలు పాత భవనాన్ని పడగొట్టారు. కొండనాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడినట్టయింది. చేసేదిలేక బైరాగి బావి వద్ద శిథిలావస్థలో ఉన్న గదులను అద్దెకు తీసుకోవాల్సిన దుస్థితి నెలకొంది. గ్రామపెద్దలు అద్దె డబ్బులకు సహకారం అందించినా తర్వాత వారు చేతులెత్తేశారు. దీంతో భారం ఉపాధ్యాయులపై పడింది. చివరకు హైస్కూల్‌ను వద్దకునే నిర్ణయానికి ఉపాధ్యాయులు వచ్చారు.

శాశ్వత పరిష్కారం చూపిన మంత్రి రజిని

హైస్కూల్లో వసతుల సమస్య మంత్రి విడదల రజిని దృష్టికి వెళ్లింది. కరోనా వేళలోనూ అధికారులతో కలిసి స్వయంగా హైస్కూల్‌ను సందర్శించిన మంత్రి రజిని విద్యార్థుల, ఉపాధ్యాయుల దీనావస్థను చూసి చలించిపోయారు. విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ధైర్యం చెప్పి వెంటనే గ్రామస్తులు, అధికారులతో మాట్లాడి పాఠశాలకు సొంతస్థలం చూపించారు. 8 నెలల్లోనే నాబార్డు నుంచి రూ.కోటిన్నర మంజూరు చేయించి యుద్ధప్రాతిపదికన పది గదులతో రెండంతస్తుల భవనాన్ని నిర్మించి ఇచ్చారు. అప్పటి వరకు పాఠశాలను నిర్వహించిన అద్దె నిల్వ డబ్బులను తన సొంత నిధుల నుంచి ఇచ్చారు. 2021 డిసెంబర్ 21న ప్రారంభోత్సవం చేసి దశాబ్దాల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపారు.



యడ్లపాడు జెడ్పీ స్కూల్, జూనియర్ కాలేజీ భవనం

పది తర్వాత పెళ్లి...

మండలం పరిధిలో 13 హైస్కూళ్లు ఉన్నాయి. వీటిలో ఒక ఎయిడెడ్, మూడు ప్రైవేటు స్కూల్స్ ఉన్నాయి. వీటిలో ఏటా 450 నుంచి 500 మంది విద్యార్థులు పదోతరగతి పరీక్షలు రాస్తున్నారు. ఉత్తీర్ణులైన వారు ఉన్నత విద్య మాత్రం ప్రశ్నార్థకంగా మారేది. ఇంటర్ విద్యను అభ్యసించేందుకు కళాశాలలు అందుబాటులో లేకపోవడమే ఇందుకు కారణం. ప్రైవేటు స్కూళ్ల ఫీజుల్ని తట్టుకోలేక కొందరు, ఆడపిల్లల్ని 12 కిలోమీటర్ల దూరంలోని చిలకలూరిపేటకు ఒంటరిగా నిత్యం ప్రయాణం చేయించడం ఇష్టంలేక మరికొందరు. గుంటూరులో చేర్పించాలంటే అక్కడ కాలేజీ, హాస్టల్ ఖర్చుల భరించలేక ఇంకొందరు.. పిల్లలను చదువును మధ్యలోనే ఆపేసేవారు. దాదాపుగా ఆడపిల్లలకు పది తర్వాత పెళ్లి చేసేసేవారు.

బాలిక విద్య ఇకపై ఆగదు



గతంలో పదిలో ఎన్ని మార్కులు వచ్చినా ఇంటర్ చదవడం గ్రామీణ బాలికలకు కష్టతరమే. ఆర్థిక ఇబ్బందులు, రక్షణ వంటి కారణాలు ఏవైనా పదితోనే చదువు ఆగిపోయేది. వెంటనే తల్లిదండ్రులు పెళ్లిళ్లు చేసేసి భారం దించుకునేవారు. అప్పటి దాకా చదివిన విద్య వృథా అయ్యేది. చదవాలన్న కోరిక నెరవేరేది కాదు. కానీ ఇప్పుడు పరిస్థితి మారింది. జూనియర్ కళాశాలను యడ్లపాడు హైస్కూల్లో ఈ ఏడాది నుంచి ఏర్పాటు చేయడంతో గ్రామీణ బాలికలకు వరంగా మారింది. మేము ఇంటర్‌లో చేరాం. జగన్ మామయ్యకు ధన్యవాదాలు.

– షేక్ ఆయేషా, వల్లపు అఖిల ఇంటర్ విద్యార్థినులు

కాలేజీ తొలి బ్యాచ్ మాదే



మంత్రి రజిని హైస్కూల్‌కు బిల్డింగ్ కట్టించి యడ్లపాడు విద్యార్థుల కలను నెరవేర్చారు. అందులోనే జూనియర్ కాలేజీ ఏర్పాటు కావడంతో పదితోనే ఆగిపోయే ఆడపిల్లల చదువు ముందుకు కొనసాగుతోంది. ఈ జూనియర్ కాలేజీలో తొలిబ్యాచ్ మాదే. మాకు ఉన్నత విద్యా అవకాశాన్ని అందించిన మంత్రి రజినికి, ముఖ్యమంత్రి జగన్ సార్‌కు రుణపడి ఉంటాం.

– ఆర్.ఝాన్సీ, పఠాన్ సనీఫా, ఇంటర్ విద్యార్థినులు

గ్రామీణ బాలికలకు వరం.. సీఎం జగన్ నిర్ణయం

మండల కేంద్రాల్లో ప్లస్‌టూ (జూనియర్ కళాశాల) ఏర్పాటు చేయాలనే సీఎం వైఎస్ జగన్ నిర్ణయం బాలికా విద్యకు భరోసానిచ్చింది. ఈ ఏడాది నుంచి యడ్లపాడు జెడ్పీ హైస్కూల్లోనే పేద, మధ్య తరగతి కుటుంబాల ఆడపిల్లలకు ఇంటర్ విద్యను అందుబాటులోకి తీసుకొచ్చారు. ప్రస్తుతం 37 మంది బాలికలు కాలేజీలో విద్యను అభ్యసిస్తున్నారు.

ఎస్‌ఐ పోస్టుల తుది రాత పరీక్షకు ఉచిత శిక్షణ

గుంటూరు ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం అక్టోబర్ 14, 15 తేదీల్లో నిర్వహించనున్న సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీసు (ఎస్‌ఐ) పోస్టుల తుది రాత పరీక్షకు హాజరుకాగోరు అభ్యర్థులకు రామ్‌కీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 27 నుంచి ఉచిత శిక్షణ కల్పిస్తున్నట్లు అధ్యక్షుడు ఎం.వి.రామిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రిలిమ్స్‌తోపాటు దేహ దారుఢ్య పరీక్షల్లో అర్హతతో పాటు 90 మార్కులు సాధించిన ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు, 100 మార్కులు సాధించిన బీసీ, ఈబీసీ, 110 మార్కులు సాధించిన ఓసీ కేటగిరీ అభ్యర్థులకు శిక్షణ కల్పిస్తామని పేర్కొన్నారు. కాకినాడలోని శ్యామ్ ఇనిస్టిట్యూట్, హైదరాబాద్‌లోని పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్ సంయుక్త సహకారంతో పకడ్బందీ ప్రణాళికతో కూడిన శిక్షణలో భాగంగా ప్రతి రోజు, ప్రతి వారం పరీక్షలు నిర్వహిస్తూ ప్రతి ఒక్కరూ ఉద్యోగ అర్హత సాధించేలా అవసరమైన సబ్జెక్టులపై అనుభవజ్ఞులైన అధ్యాపకులతో వివరణాత్మక తరగతులు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. శిక్షణతో పాటు ఉచిత భోజన, వసతి కల్పిస్తున్నామని, అర్హులైన అభ్యర్థులు తుళ్లూరు మండలం పెద పరిమిలోని రామ్‌కీ ఫౌండేషన్ నైపుణ్య శిక్షణ కేంద్రంలో పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్లు 9866777870, 9000797789తో పాటు http://www.ramkyfoundation.orgకు లాగిన్ కావాలని తెలిపారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 524.80 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 7,889, ఎస్ఎల్‌బీసీకి 900 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 853.90 అడుగుల వద్ద ఉంది.

వీరవిహారం



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో రవికుమార్ (ఫైల్)

బంగారు 'కండ'

- బాడీబిల్డింగ్‌లో అద్భుత ప్రతిభ
- ఏషియన్ పోటీల్లో రజతం
- అంతర్జాతీయస్థాయిలో సత్తా
- పేదరికంలోనూ విజయాల పరంపర
- బాడీబిల్డర్ రవికుమార్ ప్రస్థానం



జాతీయ, అంతర్జాతీయ క్రీడల్లో సాధించిన పతకాలతో రవి కుమార్

గుంటూరు వెస్ట్ (క్రీడలు): అతని ప్రతిభ ముందు పేదరికం తలొంచింది. విజయాలు సాహో అంటూ సాగిలపడ్డాయి. అంతర్జాతీయ పతకాలు దాసోహమయ్యాయి. ప్రతికూల పరిస్థితులను సైతం అనుకూలంగా మార్చుకుని ముందుకు సాగుతున్నాడు గుంటూరు శివారు ఏటుకూరుకు చెందిన నిశ్శంకరరావు రవికుమార్. అద్భుత దేహదారుఢ్యంతో (బాడీ బిల్డింగ్)తో అందరినీ అబ్బురపరుస్తున్నాడు. 25 ఏళ్ల వయసులోనే అనేక పతకాలు సాధించాడు. ఈనెల 13 నుంచి 15 వరకు ఫిలిప్పీన్స్‌లోని సెబూలో జరిగిన ఏషియన్ బాడీ బిల్డింగ్ పోటీల్లో 70–75 కేజీల విభాగంలో రజత పతకం సాధించాడు. ఇప్పటివరకు ఏషియన్ గేమ్స్‌లో రవి పొందిన మూడో పతకం ఇది. నవంబర్‌లో జర్మనీలో జరగనున్న ప్రపంచ బాడీ బిల్డింగ్ పోటీలకు ఎంపికయ్యాడు. రవి విజయగాథ ఆయన మాటల్లోనే..

మాది పేద కుటుంబం

నాన్న వెంకటరావు లారీ డ్రైవర్. అమ్మ వెంకట నరసమ్మ ఇంటి వద్దే చిన్న పచారీ కొట్టు పెట్టుకుని అందులో టిఫిన్ అమ్ముతారు. అన్న చిరుద్యోగి. అక్క నాగమణి అమ్మ తర్వాత అమ్మే. ఒక్క మాటలో చెప్పాలంటే ఏ పూట సంపాదన ఆ పూటకే. నాన్న ఎప్పుడూ ఇతర ప్రాంతాలకు వెళుతుంటారు. తల్లిదండ్రులిద్దరూ నిరక్షరాస్యులే. అమ్మ టిఫిన్ అమ్మగా వచ్చే డబ్బును నా ఆహారానికి ఖర్చు పెడుతోంది. అక్క కూడా అన్ని విధాలుగా ఆదుకుంటుంది.

ఆర్నాల్డ్ స్వార్జ్‌నెగర్‌ను చూసి..

నా స్నేహితులతో కలిసి 2013లో ఆర్నాల్డ్ స్వార్జ్‌నెగర్ నటించిన సినిమా చూసి బాడీ బిల్డింగ్‌పై ఆసక్తి పెంచుకున్నా. అప్పటి నుంచి సాధన ప్రారంభించా. 2015 నాటికి ప్రొఫెషనల్‌గా మారా. మరుసటి ఏడాదే మిస్టర్ ఆంధ్ర టైటిల్ గెలుపొందా. ప్రముఖుల అభినందనలు కొత్త ఉత్సాహాన్నిచ్చాయి. అక్కడి నుంచి వరుసగా టైటిల్స్ వచ్చాయి.

చాలా త్యాగాలు చేయాలి

తొలినాళ్లలో జాలీగా సాగిపోయిన నా సాధన అంతర్జాతీయ స్థాయికి వచ్చే నాటికి చాలా కఠినతరంగా మారింది. ఉప్పు, కారాలు, మసాలా అనేవి కనీసం దరిచేరకూడదు. అంతా ఉడికించిన ఆహారమే. పోటీలకు మూడు రోజుల ముందు నుంచి చుక్క నీరు కూడా ఉండదు. దీంతోపాటు దాదాపు 8 గంటల సాధన. నరకం కనబడుతుంది. ఆ సమయాల్లో నా దేహాన్ని చూసుకుంటే ఎంతో సంతోషంగా ఉంటుంది. దీని కోసం ఎన్ని కష్టాలనైనా పడొచ్చు అనిపిస్తుంది.

ఆహారానికి నెలకు రూ.లక్ష ఖర్చు

జిమ్, ఆహారంతో కలిపి నెలకు సుమారు రూ.లక్ష ఖర్చు అవుతోంది. 20 గుడ్లు, 750 గ్రాముల చేప, సుమారు కేజీ చికెన్, రెండు కేజీలు ఉడికించిన కూరగాయలు, డ్రైఫ్రూట్స్, ప్రొటీన్ పౌడర్లు, కాల్షియం, విటమిన్స్ ఇలా అన్నీ ప్రతి రెండు, మూడు గంటలకొకసారి తీసుకోవాలి. కనీసం 6 గంటల సాధన చేయాలి. అన్నీ ఉడికించినవే తినాలి. ఉప్పు, కారం ఉండవు.

జగన్‌సార్, గౌతం అన్న రుణం తీర్చుకోలేనిది

2020 అక్టోబర్‌లో అప్పటి హోంమంత్రి మేకతోటి సుచరిత నన్ను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వద్దకు తీసుకెళ్ళారు. నేను సాధించిన ఏషియా బంగారు పతకం చూపించా. జగనన్న ఆప్యాయంగా భుజంపై చేయివేసి మాట్లాడారు. ఆర్జా స్టీల్స్ ఎండీ శ్రీధర్, రాముకు చెప్పి రూ.7 లక్షల ఆర్థిక సాయం అందించారు. జగన్ సార్ దయవల్ల ఇప్పటికీ వారి సహకారం కొనసాగుతోంది. సీఎంను కలిసిన సమయంలోనే మేకపాటి గౌతంరెడ్డితో పరిచయమైంది. గౌతం అన్నకు బాడీ బిల్డింగ్ అంటే చాలా ఇష్టం. నన్ను బాగా ప్రోత్సహించారు. ఫోన్‌లో మాట్లాడి టిప్స్ కూడా చెప్పేవారు. అప్పుడు నేను తీసుకున్న మిస్టర్ యూనివర్స్ కాంస్య పతకం చూడకుండానే ఆయన భగవంతుడి వద్దకు వెళ్ళిపోవడం బాధాకరం. ఇప్పుడు నేను సాధించిన ఏషియన్ సిల్వర్ మెడల్ ఆయనకు అంకితం చేస్తున్నా.

ఇవీ సాధించిన విజయాలు

- 2018లో మహారాష్ట్రలోని పూణేలో జరిగిన ఏషియన్ బాడీ బిల్డింగ్ పోటీల్లో 75 కేజీల విభాగంలో కాంస్యం.
- 2019లో ఇండోనేషియాలోని బాలీలో జరిగిన ఏషియన్ బాడీబిల్డింగ్ పోటీల్లో 75 కేజీల విభాగంలో బంగారు పతకం.
- 2019లో ఢిల్లీలో జరిగిన జాతీయ పోటీల్లో 'మిస్టర్ ఇండియా' టైటిల్.
- 2021లో రష్యాలోని ఉజెబెకిస్తాన్‌లో జరిగిన ప్రపంచ బాడీ బిల్డింగ్ పోటీల్లో 6వ స్థానం (72 దేశాలు పాల్గొన్నాయి).
- 2022లో పూణేలో జరిగిన మిస్టర్ యూనివర్స్ పోటీల్లో కాంస్య పతకం.
- 12 సార్లు మిస్టర్ ఆంధ్ర టైటిల్స్ కైవసం.
- ఐఎఫ్‌బీబీ (ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ బాడీ బిల్డింగ్) ప్రత్యేక పాస్‌పోర్ట్ జారీ

మిస్టర్ ఒలింపియాగా నిలవాలి

తొలి దశలో చాలా మంది వద్ద శిక్షణ తీసుకున్నా. ఆ తర్వాత శ్రీలంకకు చెందిన మిస్టర్ ఒలింపియా పుష్పరాజ్ వద్ద 3 నెలలు కఠోర శిక్షణ పొందాను. ఆ శిక్షణ నా అంతర్జాతీయ పోటీలకు లాభించింది. ఈ ఏడాది నవంబర్‌లో జరగనున్న ప్రపంచ బాడీ బిల్డింగ్ పోటీలకు ఎంపికయ్యా. వచ్చే ఏడాది మిస్టర్ ఒలింపియా పోటీలు ఉంటాయి. ఈ రెండు పోటీల్లోనూ విజేతగా నిలవాలి. ప్రస్తుతం రాష్ట్రంలో క్రీడలకు మంచి ఆదరణ లభిస్తోంది. దాతలు కొంత ఆర్థిక చేయూతనందిస్తే మరింతగా రాణిస్తాను.



తల్లి వెంకట నరసమ్మతో రవి

గణేశుని నిమజ్జనంలో అపశ్రుతి

కృష్ణానదిలో మునిగి తండ్రీకొడుకుల మృతి

మాచవరం: వినాయక విగ్రహ నిమజ్జనం సందర్భంగా అపశ్రుతి చోటుచేసుకుంది. కృష్ణానదిలో మునిగి తండ్రీకొడుకులు దుర్మరణం పాలయ్యారు. ఈ హృదయవిదారక ఘటన మాచవరం మండలంలోని గోవిందాపురం బల్లకట్టు రేవు వద్ద బుధవారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. పిడుగురాళ్ల పట్టణంలో రావిళ్ల హోటల్ పరిధిలో క్లాత్ మర్చంట్స్ ఆధ్వర్యంలో వినాయకుని విగ్రహం ఏర్పాటు చేశారు. బుధవారం విగ్రహాన్ని నిమజ్జనం చేసేందుకు మండలంలోని గోవిందాపురం బల్లకట్టు రేవు వద్దకు భక్తులు ఊరేగింపుగా వెళ్లారు. నిమజ్జనం అనంతరం స్నానం చేసేందుకు పట్టణానికి చెందిన నీరుమళ్ల శ్రీనివాసరావు (46) నదిలోకి దిగారు. రాత్రి సమయం కావడంతో లోతులోకి వెళ్లి మునిగిపోయాడు. తండ్రిని కాపాడేందుకు కుమారుడు నీరుమళ్ల వెంకటేష్ (26) నదిలోకి దిగాడు. ఇద్దరూ గల్లంతయ్యారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చేపట్టారు. రాత్రి సమయం కావడంతో గాలింపు చర్యలకు ఆటంకం కలిగింది. తిరిగి గురువారం ఉదయం గజ ఈతగాళ్ల సాయంతో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ఘటనా స్థలంలోనే రెండు మృతదేహాలు లభ్యమయ్యాయి. తండ్రీకొడుకుల మరణంతో పిడుగురాళ్ల పట్టణంలో విషాదం నెలకొంది. మృతుడు శ్రీనివాసరావు చిన్న కుమారుడు నీరుమళ్ల సురేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సమీర్ బాషా తెలిపారు.




తండ్రీకొడుకులు శ్రీనివాసరావు, వెంకటేష్(ఫైల్)

రెండునెలల్లో పెళ్లి.. అంతలోని విషాదం

పిడుగురాళ్ల: శ్రీనివాసరావుకు ఇద్దరు కుమారులు. వెంకటేష్ పెద్దకుమారుడు. పట్టణంలోని రావిళ్ల హోటల్ సమీపంలో ఎంబ్రాయిడింగ్ వర్క్ చేస్తున్నాడు. ఈనెల 6న వెంకటేష్ వివాహం నిశ్చయమైంది. నవంబర్‌లో పెళ్లి చేయాలని శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు నిర్ణయించారు. బుధవారం రాత్రి తండ్రీకొడుకులిద్దరూ వినాయక నిమజ్జనానికి వెళ్లి మాచవరం మండలం గోవిందాపురం వద్ద కృష్ణానదిలో మునిగి మృతి చెందడంతో కుటుంబ సభ్యులు గుండెలవిసేలా రోదిస్తున్నారు. ఫలితంగా పట్టణంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

నలుగురిని కాపాడిన మెరైన్ పోలీసులు

వినాయక నిమజ్జనంలో తప్పిన ప్రమాదం

చీరాల టౌన్: గణేశ్ నిమజ్జనంలో పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించడంతో నలుగురు మహిళలను మెరైన్ పోలీసులు ప్రాణాలతో కాపాడారు. ఈ ఘటన గురువారం సాయంత్రం చీరాల మండలం వాడరేవులో చోటు చేసుకుంది. మెరైన్ ఎస్సై పసుపులేటి సుబ్బారావు తెలిపిన వివరాల మేరకు.. చిలకలూరిపేటకు చెందిన 50 మంది బృందం కలిసి గణేశ్ నిమజ్జనం కోసం వచ్చారు. సముద్రంలో నిమజ్జనం చేసి స్నానాలు చేస్తుండగా బృందంలోని నలుగురు మహిళలు అలల తాకిడికి కొట్టుకుపోయారు. వెంటనే గమనించిన మెరైన్ పోలీసులు సైకం ప్రసాద్, ఎస్.చిరంజీవి, ఎ.నరేష్, హోంగార్డు పోతురాజులు స్పందించి తమ ప్రాణాలను పణంగా పెట్టి గల్లంతవుతున్న నలుగురు మహిళలను ప్రాణాలతో కాపాడారు. సముద్రపు నీరు తాగిన వారికి ప్రాథమిక చికిత్సలు చేసి అనంతరం వారి బంధువులకు అప్పగించారు. పోలీసులు, బందోబస్తు చేస్తున్న సివిల్ పోలీసులు ఏమాత్రం ఏమరపాటుగా ఉన్నా నలుగురు మహిళలు గల్లంతయ్యేవారు. క్షణాల్లో స్పందించి మహిళలను కాపాడిన పోలీసులను వారి బంధువులతోపాటు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, మెరైన్ సీఐ శ్రీనివాసరావు అభినందించారు.



మహిళలను కాపాడి వారితో మాట్లాడుతున్న మెరైన్ ఎస్సై సుబ్బారావు, పోలీసులు

హత్యాయత్నం కేసులో నాలుగేళ్ల జైలు

నరసరావుపేట టౌన్: హత్యాయత్నం కేసులో నిందితుడికి నాలుగేళ్ల జైలు శిక్ష విధిస్తూ అడిషనల్ సెషన్స్ జడ్జి మధుస్వామి గురువారం తీర్పు చెప్పారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేట పట్టణానికి చెందిన తేళ్ళ సుధీర్‌పై కావూరి వెంకటేశ్వరరావు 2018లో దాడికి పాల్పడ్డాడు. వినాయక చవితి పందిళ్ల వ్యవహారంలో ఈ గొడవ చోటు చేసుకుంది. ఘటనలో తీవ్రంగా గాయపడ్డ బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన చిలకలూరిపేట పట్టణ పోలీసులు ప్రాథమిక దర్యాప్తు అనంతరం నిందితుడిపై అభియోగపత్రం దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో నిందితుడు కావూరి వెంకటేశ్వరరావుకు నాలుగేళ్ల జైలు శిక్ష, 1,000 రూపాయల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

జాతీయ ఫైరింగ్ పోటీకి ఎన్‌సీసీ క్యాడెట్ సింధూర



నరసరావుపేట ఈస్ట్: శ్రీ సుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్ వాసిమళ్ల సింధూర ఢిల్లీలో జరగనున్న ఆల్ ఇండియా ఎన్‌సీసీ ఇంటర్ డైరెక్టరేట్ ఫైరింగ్ పోటీకి ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సోము మల్లయ్య, ఎన్‌సీసీ ఆఫీసర్ మేజర్ బీఎస్ఆర్‌కే రాజు గురువారం తెలిపారు. ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన ఉభయ తెలుగు రాష్ట్రాల ఎన్‌సీసీ డైరెక్టరేట్ తల్ సైనిక్ క్యాంప్‌లో ప్రతిభ చాటి ఆల్‌ఇండియా తల్ సైనిక్ క్యాంప్ పోటీకి ఎంపికైనట్టు వివరించారు. సింధూరను కళాశాల పాలకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు కపలవాయి విజయకుమార్, నాగసరపు సుబ్బరాయగుప్తా, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎంఎస్ సుధీర్, గుంటూరు గ్రూప్ ఎన్‌సీసీ అధికారులు అభినందించారు.

క్లుప్తంగా

రాష్ట్ర ఫుట్‌బాల్ జిల్లా జట్టు ఇదే



గుంటూరు వెస్ట్ (క్రీడలు): రాష్ట్ర పోటీల్లో పాల్గొననున్న జిల్లా ఫుట్‌బాల్ జట్టును ఎంపిక చేసినట్లు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షులు కుమ్మరి క్రాంతి కుమార్ గురువారం తెలిపారు. ఈ నెల 22 నుంచి 24 వరకు నెల్లూరులో జరగనున్న అంతర్ జిల్లాల మెన్ సీనియర్ ఫుట్‌బాల్ పోటీల్లో ఎంపిక చేసిన జట్టు పాల్గొంటుందన్నారు. ఈ నెల 19న ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయంలో జరిగిన పోటీల్లో జిల్లా జట్టు ప్రథమ స్థానం సాధించిందన్నారు. దీంతో రాష్ట్ర పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించినట్లు చెప్పారు. స్వల్ప మార్పులతో తుది జట్టును ఎంపిక చేసినట్లు తెలిపారు. జట్టు చీఫ్ కోచ్‌గా డి.వెంకటేశ్వర్లు, శ్రీనాథ్‌లు వ్యవహరిస్తారన్నారు.

టీడీపీ నాయకురాలు యువరాణి అరెస్ట్

మంగళగిరి: స్థానిక పెదవడ్లపూడికి చెందిన టీడీపీ మహిళా నాయకురాలు యువరాణిని గురువారం అరెస్ట్ చేసినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. స్థానిక వైఎస్సార్ సీపీ నాయకురాలు పాలేటి కృష్ణవేణి తనపై యువరాణి దాడి చేసిందని పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు ఆమెను అరెస్టు చేసి కోర్టుకు హాజరుపర్చినట్లు తెలిపారు.

అనుబంధ విభాగాలే పార్టీకి పట్టుగొమ్మలు

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్య వరప్రసాద్
- అనుబంధ విభాగాల నాయకులతో సమీక్ష



అనుబంధ విభాగాల అధ్యక్షులతో మాట్లాడుతున్న డొక్కా మాణిక్యవరప్రసాద్

పట్నంబజారు: ఏ రాజకీయ పార్టీకైనా అనుబంధ విభాగాలే పట్టుగొమ్మలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్య వరప్రసాద్ చెప్పారు. బృందావన్ గార్డెన్స్‌లోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో గురువారం అనుబంధ విభాగాల అధ్యక్షుల సమావేశం జరిగింది. ఈసందర్భంగా వరప్రసాద్ మాట్లాడుతూ ప్రతి పార్టీకి అనుబంధ విభాగాల కమిటీలే ఎంతో బలమన్నారు. ఈక్రమంలో పూర్తిస్థాయిలో జిల్లా అనుబంధ విభాగాల కమిటీల తుది జాబితాను సిద్ధం చేయాలని సూచించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేశారని, వీటినే ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. అదేవిధంగా ప్రతి గడపకు సంక్షేమం, అభివృద్ధి ఏవిధంగా అందిందో తెలియజేయాలన్నారు. పూర్తిస్థాయిలో అనుబంధ విభాగాలను కమిటీలను సంసిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో అనుబంధ విభాగాల అధ్యక్షులు మాదా రాధాకృష్ణ మూర్తి, హోం ప్రకాష్‌రెడ్డి, యు. మురళి, ఆవుల సుందర రెడ్డి, మాదాసు కిరణ్, భగవాన్ పాల్గొన్నారు.

వేర్వేరు చోట్ల ఇరువర్గాల ఘర్షణ

- యలవర్తిపాడులో నలుగురికి తీవ్ర గాయాలు
- చికిత్స పొందుతూ ఒకరి మృతి
- నారాకోడూరు ఘటనలో 25 మందిపై కేసు



మృతిచెందిన మన్నవ బాబూరావు



తీవ్రగాయాలపాలైన మన్నవ ఆశీర్వాదం

మేడికొండూరు: మండల పరిధిలోని యలవర్తిపాడు గ్రామంలో గురువారం రాత్రి రెండు కుటుంబాల మధ్య జరిగిన ఘర్షణ ఒకరి ప్రాణాలు తీసింది. స్థానికుల కథనం ప్రకారం గ్రామంలోని మన్నవ పుల్లయ్య, మన్నవ చిన్నబాబు కుటుంబాల మధ్య నగదు విషయంలో స్వల్ప వివాదం ఏర్పడింది. దీంతో ఇరువురూ మేడికొండూరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదులు చేసుకున్నారు. పోలీసులు ఇరువర్గాల వారిని రాజీ కుదర్చి పంపించారు. అయితే గురువారం రాత్రి 9 గంటల సమయంలో ఓ వర్గం వారు మరో వర్గం వారిని కవ్వించే ప్రయత్నం చేశారు. దీంతో రెండు వర్గాల వారు కత్తులు, గొడ్డళ్లు, కర్రలతో దాడికి దిగారు. ఘర్షణలో కొందరికి తీవ్రగాయాలు కావడంతో గుంటూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అయితే అక్కడ పుల్లయ్య కుటుంబానికి చెందిన మన్నవ జ్ఞానానందం అలియాస్ బాబూరావు (50) చికిత్స పొందుతూ మృతిచెందాడు. సీఐ వాసు సిబ్బందితో సంఘటనా చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. గాయాలపాలైన వారిని అంబులెన్సులో గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రికి తరలించారు.

చేబ్రోలు: వినాయక నిమజ్జన ఊరేగింపు సమయంలో జరిగిన వివాదంలో ఇరువర్గాలలు ఘర్షణ పడిన ఘటనలో 25 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కె.ఆనంద్ గురువారం తెలిపారు. బుడంపాడు గ్రామానికి చెందిన ఓ సామాజిక వర్గానికి చెందిన వారు వినాయక నిమజ్జనం నిమిత్తం భారీ వినాయక విగ్రహాన్ని డీజేలతో ఊరేగింపుగా సంగంజాగర్లమూడి వద్దకు వెళ్లేందుకు నారాకోడూరు సెంటర్ వద్దకు చేరుకున్నారు. అయితే పాటలు పెట్టే విషయంలో వివాదం జరిగింది. స్థానికులు ఈ వివాదాన్ని శాంతింప చేసి పంపారు. బుడంపాడుకు చెందిన వినాయక విగ్రహం నిమజ్జనం చేసుకొని తిరిగి వెళ్లే సమయంలో పథకం ప్రకారం నారాకోడూరులోని తెనాలి రోడ్డులో సుమారు 20 మంది కర్రలు, ఇనుపరాడ్లతో దాడి చేశారు. ఈ ఘటనలో బుడంపాడుకు చెందిన ఐదుగురికి గాయాలయ్యాయి. జరిగిన సంఘటనపై నారాకోడూరుకు చెందిన అనిల్‌తో పాటు 20 మందిపై, బుడంపాడుకు చెందిన ఐదుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కె.ఆనంద్ తెలిపారు.

వినాయకుడి లడ్డూ రూ.లక్షా16 వేలు



రేపల్లె రూరల్: పట్టణంలోని 23వ వార్డులో నెలకొల్పిన విఘ్నేశ్వరుని నిమజ్జన మహోత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన లడ్డూ ప్రసాదం వేలం పోటాపోటీగా సాగింది. వేలంలో లడ్డూప్రసాదాన్ని వార్డు కౌన్సిలర్ తులసీ దుర్గాప్రసాద్ రూ.లక్షా16వేలకు కైవసం చేసుకున్నాడు. దుర్గాప్రసాద్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో మోపిదేవి వెంకట రమణారావు అఖండ మెజార్టీతో గెలవాలని ఆకాంక్షిస్తూ లడ్డూను వేలంలో కైవసం చేసుకుని మోపిదేవి కుటుంబ సభ్యులకు అందజేయటం జరిగిందన్నారు.

వినియోగదారుల ఉత్పత్తి మండలి మెంబర్‌గా కట్టా



చినగంజాం: జిల్లా వినియోగదారుల ఉత్పత్తి మండలి మెంబర్ గా కట్టా శ్రీనివాసరావు నియమితులయ్యారు. జిల్లా పౌర సరఫరాలశాఖ అధికారి విలియమ్స్ నుంచి గురువారం ఆయన నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ తనపై నమ్మకంతో మెంబర్‌గా నియమించినందుకు చట్ట విశిష్టతను, ప్రాధాన్యతను తెలియజేయటంలో ప్రజలు సద్వినియోగం చేసుకునేందుకు తన వంతు కృషి చేస్తానని అన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

నాణ్యమైన విద్యుత్, మెరుగైన సేవలే ధ్యేయం

అద్దంకి రూరల్: ప్రజలకు నాణ్యమైన విద్యుత్, మెరుగైన సేవలు అందించటమే ధ్యేయమని విద్యుత్ శాఖ సీజీఎం డి సుబ్బారావు అన్నారు. గురువారం శింగరకొండలోని వేమారెడ్డి సత్రంలో విద్యుత్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీజీఎం సుబ్బారావు మాట్లాడుతూ జిల్లాలో ఉన్న ఉన్న ఐదు డివిజన్‌లలో ప్రతి ఉద్యోగి ప్రతిభ కనబరచాలన్నారు. విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. విద్యుత్ బిల్లుల్లో లోపాలు, మీటర్లు సరిగా రావడం లేదన్న సమస్యలు తమ దృష్టికి వచ్చాయని, ఇంజినీరింగ్ ఉద్యోగులు, రెవెన్యూ అధికారులు తమ విధుల్లో నిర్లక్ష్యాన్ని వీడాలన్నారు. అనంతరం డివిజన్ స్థాయి ఉద్యోగులతో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ఈఈ మస్తాన్‌రావు, అధికారులు పాల్గొన్నారు.

వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య



మృతురాలు ఉమారాణి (ఫైల్)

చీరాల అర్బన్: పిల్లలు పుట్టడం లేదని అత్తమామలు, బావ వేధింపులకు గురిచేయడంతో మనస్తాపానికి గురైన వివాహిత ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన గురువారం చీరాల నవాబుపేటలో చోటుచేసుకుంది. నవాబుపేటకు చెందిన ఉమారాణి (35), ఉమామహేశ్వరరావులు భార్యాభర్తలు. వీరికి పదేళ్ల క్రితం వివాహమైంది. అయితే వీరికి పిల్లలు పుట్టకపోవడంతో ఒక బాబును దత్తత తీసుకుని పెంచుకుంటున్నారు. అయితే ఆస్తి ఎక్కడ ఆ బాబుకు చెందుతుందోనని భార్యాభర్తలను భర్త, అత్తమామలు గాంధీ, కృష్ణవేణి, బావ లక్ష్మీనారాయణలు ఉమారాణిని మానసికంగా చిత్రహింసలకు గురిచేశారంటూ మృతురాలి కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడిందని వారు ఆరోపిస్తున్నారు. తన ఆత్మహత్యకు అత్తమామలు, బావ వేధింపులే కారణమని మృతురాలు సూసైడ్ లెటర్‌లో రాసిందని సమాచారం. విషయం తెలుసుకున్న ఒన్‌టౌన్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలను నమోదు చేశారు.

చిన్నారులూ.. క్రీడా స్ఫూర్తిని అలవరచుకోండి

చీఫ్ కోచ్ వెంకటేశ్వరరావు సూచన



కబడ్డీ పోటీల్లో తలపడుతున్న చిన్నారులు

గుంటూరు వెస్ట్ (క్రీడలు): చిన్నారులు గెలుపోటములను సమానంగా స్వీకరించే క్రీడాస్ఫూర్తిని అలవరచుకోవాలని డీఎస్‌ఏ చీఫ్ కోచ్ జి.వెంకటేశ్వరరావు తెలిపారు. స్కూల్ గేమ్స్–2023లో భాగంగా గురువారం స్థానిక బీఆర్ స్టేడియంలో అండర్–14, 17 బాల బాలికల కబడ్డీ, ఖో–ఖో, వాలీబాల్, త్రోబాల్, బాల్ బ్యాడ్మింటన్, షటిల్, టెన్నికాయిట్, యోగా జరిగాయి. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. చిన్నారులు క్రీడా పోటీల్లో తలపడ్డారు. డి.సురేష్, కోచ్‌లు పాల్గొన్నారు.

సైబర్ మోసానికి ఐటీ ఉద్యోగి బలి

బాపట్లటౌన్: సైబర్ నేరగాళ్ల మోసపూరిత మాటలు నమ్మి రూ.3.78 లక్షలు మోసపోయిన ఘటన పట్టణంలోని ఇస్లాంపేటలో చోటుచేసుకుంది. ఇస్లాంపేటకు చెందిన గొప్పరాజు దుర్గామోహన్ వెంకటకృష్ణ సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తుంటాడు. తన మొబైల్‌కు టెలిగ్రామ్ ద్వారా వచ్చిన మెసేజ్‌ను నమ్మి ఆన్‌లైన్‌లో మెసేజ్ క్లిక్ చేశాడు. ఆ తర్వాత వచ్చిన మెసెజ్‌లకు సమాధానం ఇస్తూ వచ్చిన ఓటీపీ నెంబర్లను సైబర్ నేరగాళ్లకు చెప్పారు. తర్వాత అకౌంట్ నుంచి రూ.3.78 లక్షలు స్వాహా అయ్యాయని పట్టణ పోలీసులను ఆశ్రయించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్‌ఐ షేక్ రఫీ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పుట్టిన రోజునాడే అదృశ్యమయ్యాడు!

- స్నేహితులతో కలసి కృష్ణానదిలో ఈతకు దిగిన యువకుడు
- గాలించినా లభించని ఆచూకీ



పిల్లా రాహుల్ రెడ్డి (ఫైల్)

తాడేపల్లిరూరల్: జిల్లాలను దాటి వలస వచ్చి చిరు ఉద్యోగం చేసుకుంటున్న ఓ యువకుడు పుట్టిన రోజు సందర్భంగా ఫుల్‌గా మద్యం సేవించి స్నేహితులతో కలసి కృష్ణానదిలో ఈతకు దిగి గల్లంతైన సంఘటన గురువారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ శ్రీనివాసరావు కథనం ప్రకారం రాజమండ్రికి చెందిన పిల్లా మహేష్‌రెడ్డి, జయలక్ష్మి దంపతుల ఏకైక కుమారుడైన పిల్లా రాహుల్ రెడ్డి (26) చదువు పూర్తయిన తరువాత కంప్యూటర్ కోర్సు నేర్చుకుంటానని విజయవాడ వచ్చాడు. ఇక్కడకు వచ్చిన తరువాత ర్యాపిడ్ వాహనాలకు డ్రైవర్‌గా చేస్తూ స్నేహితులతో కలసి ఒక గదిలో అద్దెకు ఉంటున్నాడు. తెల్లవారుజామునే పుట్టినరోజు సందర్భంగా స్నేహితులైన పృథ్వీరాజ్, సుబేర్‌లతో కలసి ఫుల్‌గా మద్యం సేవించి కృష్ణానదిలో స్నానం చేసేందుకు ఉండవల్లి అమరావతి కరకట్ట వెంబడి కొండవీటివాగు ఎత్తిపోతల పథకం వద్ద నీటిలోకి దిగారు. ముగ్గురు కృష్ణానదిలోకి దిగిన వెంటనే రాహుల్ రెడ్డి నీటిలో మునిగిపోవడంతో స్నేహితులు బిగ్గరగా కేకలు వేశారు. అక్కడే ఈత వేస్తున్న కొంతమంది రాహుల్ రెడ్డి కోసం నీటిలో గాలించినప్పటికీ ఎటువంటి ఉపయోగం లేకుండా పోయింది. తాడేపల్లి పోలీస్ స్టేషన్‌కు స్థానికంగా ఉన్న వారు సమాచారం ఇవ్వడంతో సంఘటనా స్థలానికి వెళ్లి గజ ఈతగాళ్ల సహాయంతో గల్లంతైన రాహుల్ రెడ్డి ఆచూకీ కోసం ప్రయత్నించినప్పటికీ ఎటువంటి ప్రయోజనం కలగలేదని, తండ్రి రమేష్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

లారీ ఢీకొని హెడ్ కానిస్టేబుల్ మృతి




మృతుడు అనిల్

ఫిరంగిపురం: విధులు ముగించుకొని తిరిగి వస్తుండగా ప్రమాదవశాత్తు ఎదురుగా వచ్చిన లారీ ఢీకొనడంతో హెడ్ కానిస్టేబుల్ మృతి చెందిన సంఘటన మండలంలోని వేములూరిపాడు గ్రామశివారులో గురువారం సాయంత్రం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం ఫిరంగిపురం గ్రామానికి చెందిన గుండిగ అనిల్ (43) ముప్పాళ్ల పోలీసు స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పని చేస్తున్నాడు. విధుల్లో భాగంగా ఉదయం గుంటూరు పోలీసు పేరేడ్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న ఎస్‌ఐ సెలక్షన్‌కు వెళ్లి విధులు ముగించుకొని తిరిగి మోటారు సైకిల్‌పై వస్తున్నాడు. మండలంలోని వేములూరిపాడు గ్రామ శివారు వద్దకు రాగానే కడప నుంచి గుంటూరు సిమెంటు బ్రిక్స్ లోడుతో వెళుతున్న లారీ మోటారు సైకిల్‌ను ఢీకొంది. ఈ ఘటనలో అనిల్‌కు తీవ్రగాయాలు అయ్యాయి. దీంతో అతడిని చికిత్స కోసం గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. నరసరావుపేట టూటౌన్‌లో పనిచేస్తు ముప్పాళ్ళకు బదిలీపై వెళ్లాడు.

కుల దూషణ కేసులో ఏడాది జైలు

తెనాలిరూరల్: యువతితో అసభ్యంగా ప్రవర్తించడమే కాకుండా కులం పేరుతో ఆమెను, ఆమె తల్లిని దూషించిన కేసులో నిందితుడికి ఏడాది జైలు శిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ నాజరుపేటకు చెందిన 21 ఏళ్ల యువతి పొట్లూరి ప్రసన్న ఇళ్లలో పనులు చేస్తూ ఉండేది. ఈ క్రమంలో 2019లో విష్ణుమొలకల జయరావు ఇంట్లో పనిచేస్తుండగా అతను తన భార్య లేని సమయంలో ప్రసన్నతో అసభ్యంగా ప్రవర్తించాడు. దీనిని ఆమె ప్రతిఘటించడం, అదే సమయంలో పక్కన ఇంట్లో పనిచేస్తున్న ప్రసన్న తల్లి అక్కడకు రావడంతో ఇద్దరినీ కులం పేరుతో దూషించాడు. బాధితురాలు వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించగా అప్పటి డీఎస్పీ శ్రీలక్ష్మి దర్యాప్తు చేశారు. కేసు గుంటూరులోని ఎస్సీ, ఎస్టీ కోర్టులో గురువారం విచారణకు రావడంతో సాక్షాధారాలను పరిశీలించిన న్యాయమూర్తి, నిందితుడు జయరావుకు ఏడాది జైలు శిక్ష, రూ. 1500 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ శారదామణి వాదించారు.

యార్డులో 29,264 బస్తాల మిర్చి విక్రయం



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం 27,741 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 29,264 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.10,500 నుంచి రూ.23,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.10,000 నుంచి 26,000 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.10,000 నుంచి రూ.23,000 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.10,000 నుంచి 23,500 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.14,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 10,795 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.